క్లుప్తంగా

చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నాయకులు

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం అందజేశారు. కొప్పుల గంగయ్యకు రూ. 1,20,000, రాథోడ్ శృతికి రూ. 26000ల చెక్కులను అందజేశారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గొర్ల రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ కుర్మె మహేందర్, నాసర్ అహ్మద్, అబ్రార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీలు

బోథ్: వేసవి సెలవులు మంజూరు చేయడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం బోథ్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎంతో పాటు, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమకు రూ. 18 వేలు, వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా లబ్ధిదారుల ఎంపిక


మాట్లాడుతున్న మహేందర్

నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో ఇష్టారాజ్యం కొనసాగుతుందని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీకి ఇందిరమ్మ ఇళ్ల జాబి తాను కమిటీ నిర్ణయించిన విధంగా తయారు చేశారని మండిపడ్డారు. అర్హులైన పేదల పేర్లను తొలగిస్తూ తమ కాంగ్రెస్ నాయకుల పేర్లను చేరుస్తున్న తీరు సరైంది కాదన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న పశువైద్యాధికారి జీవన్

నేరడిగొండ: పశుపోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శనివారం మండలంలోని ఆరెపల్లి, కొర్టికల్, ధన్నూర్(డి) గ్రామాల్లో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు అందజేత

తాంసి: క్షయతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను శనివారం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో క్షయతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య కేంద్రంలో హెచ్ఈవో జ్ఞానేశ్వర్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది మేఘ, లబ్బుబాయి, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బడుగు బలహీన వర్గాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు కొండమడుగు గణేష్ అన్నారు. శనివారం సొనాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. నిరుపేదలైన వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్, కుందూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అరిగోస..!

- మార్కెట్‌యార్డు లేక అన్నదాత ఆందోళన
- మంజూరు చేయాలని వేడుకోలు


సొసైటీకి అమ్మేందుకు తీసుకువచ్చిన జొన్న పంట

సిరికొండ: రైతు ఆరుగాలం శ్రమించి పంట పండించాలంటే ఎంత కష్టపడుతాడో, పండించిన పంటను అమ్మలంటే కూడా అంతే కష్టపడుతున్నారు. పంట చేతికొచ్చి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మలంటే మార్కెట్ వెళ్లిన రైతన్న అరిగోస పడుతున్నాడు. మార్కెట్‌యార్డు ఉన్న చోటనే ఎంతో ఇబ్బంది ఉన్నాయి. అలాంటిది లేని చోట రైతులు అంతకు మించి అష్టకష్టాలు పడుతున్నారు.

మద్దతు ధరకు..

సిరికొండ మండలంను 2016లో ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాల్లో కలిసి ఉండేది. అయితే ఈ మండలంలోని రైతన్నలు తము పండించిన పంటను 15 కిలోమీటర్ల దూరంలోని ఇచ్చోడ, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి విక్రయించేవారు. దీంతో దూర భారంతో పాటు మండల రైతుల కోసం నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో సిరికొండ సిరి సంపదల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా కొనుగోల కేంద్రం ఏర్పాటు చేసి జొన్న, మొక్కజొన్న, శనగలు, సోయా పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మండలంలోని రైతన్నలకు దూరం భారం తప్పింది. కానీ ఆ పంటలను విక్రయించడానికి కొనుగోలు కేంద్రానికి పంట తీసుకువస్తే ఇక్కడ సరైన వసతులు లేక రైతన్నలు వర్షం, పశువుల నుంచి పంటను కాపాడుకోవడం గగనమైంది.

మార్కెట్‌యార్డు మంజూరు చేస్తే..

మండలంలో సుమారుగా 21 వేల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు పండిస్తున్నారు. పంటను అమ్మడం కోసం మండల వ్యాప్తంగా ఇక్కడికి తీసుకువచ్చి సిరికొండ సిరి సంపదల రైతు ఉత్పత్తి లిమిటెడ్ వారికి విక్రయిస్తున్నారు. ఇక్కడ వారికి సరైన వసతులు లేవు. మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ప్రైవేట్ స్థలంలో కొనుగోళ్లు చేపడుతున్నారు. రాత్రి వేళ పంటను పశువులు ధ్వంసం చేస్తున్నాయి. ఈ కష్టాలు గట్టెక్కలాంటే మండలానికి మార్కెట్‌యార్డు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌యార్డు మంజూరు చేయాలి



నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలానికి మార్కెట్ యార్డు మంజూరు చేయాలి. పండించిన పంట అమ్మలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మండలానికి మార్కెట్‌యార్డు మంజూరు చేయించాలి.

– మోరె జ్ఞానేశ్వర్, రైతు, రాంపూర్(బి)

వెంటాడుతున్న కష్టాలు..



దేశానికి రైతే రాజు అంటారు. కాని రైతుకు ఎప్పుడు కష్టాలు వెంటడుతునే ఉంటాయి. మేము పంట పండించాలంటే అతివృష్టి, అనావృష్టి, అటవీ జంతువుల నుంచి కాపాడాలంటే ఇబ్బంది పడుతున్నాం. మార్కెట్‌లో సరైన వసతులు లేవు.

– గేడం దత్తు, రైతు, సిరికొండ

పంటను కాపాడుకునేందుకు ఇబ్బంది



జొన్నలు అమ్మేందుకు ఇక్కడి తీసుకువచ్చాం. ఆ రోజు ఆకాశం మేఘవృతం అయి వర్షపడే అవకాశం ఉండటంతో పంటను కాపాడుకోవడం కోసం కవర్లు కప్పాం. రాత్రి వర్షం కురిసింది. చాలా భయపడ్డాం పంట తడిసిపోతుందని.

– తుమ్మ మల్లేశ్, రైతు, సిరికొండ

రైతులకు పట్టాలందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్: గత 50 ఏళ్లుగా వ్యవసాయ భూములను సాగు చేస్తున్న రైతులకు వెంటనే పట్టాలు జారీ చేసి ప్రభుత్వ ప్రయోజనాలు దక్కేలా చూడాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. సాత్నాల మండలంలోని మాంగూర్ల, సుందరగి గ్రామాల్లోని రైతుల సమస్యల పరిష్కారం కోసం శనివారం మాంగూర్లలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. గ్రామంలోని ముస్లింల వద్ద నుంచి వంద మంది రైతులు 210 ఎకరాలను కొనుగోలు చేశారన్నారు. ఇప్పటి వరకు వారికి పట్టాలు లేకపోవడంతో సాదాబైనామా ఆప్షన్ ధరణిలో లేకపోవడంతో రైతులు భూమిని సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు జారీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో దాని ఆప్షన్ ఇచ్చిందని దీని ప్రకారం రైతులకు పట్టాలు అందించి ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు పొందేలా చూడాలన్నారు. సాదాబైనామా నిబంధనతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ గిజ్జ లక్ష్మి పార్టీలో చేరగా ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని భోరజ్, బేల, రూరల్, జైనథ్ మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం ఇచ్చే సాయం లబ్దిదారులకు త్వరితగతిన అందించేలా చూడాలని అధికారులను కోరారు. ఆడ పిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు సంతోషంగా ఉన్నప్పటికి వేదవారిలో ఆర్థిక సమస్య ఎక్కువగా వేధిస్తుందన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరీ పాల్గొన్నారు.

అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలం బీర్సాయిపేట గ్రామంలో శిరిడి సాయిబాబా మహిళ సమాఖ్య భూపేట, బీర్సాయిపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నేడు మహిళ సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అప్పగించామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ రవీందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న కిషన్

బజార్‌హత్నూర్: పశుగ్రాసం విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, జొన్న కోత తర్వాత జొన్న కాండం చుట్టు మొలకలు వస్తాయని ఆ జొన్న లేపతిని పశువులు చనిపోయే అవకాశం ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ అన్నారు. శనివారం మండలంలోని బుర్కపల్లిలో జొన్నలేప తిని 20 ఆవులు మృతి చెందిన విషయం తెలుసుకుని ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. వైద్య చికిత్స పొందుతున్న మరో 35 ఆవుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులను, మందులను పరిశీలించారు. మండల పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చు


ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఇసుక అవసరమున్న వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆత్రం నారాయణ సూచించారు. శనివారం పెన్‌గంగా పరివాహక గ్రామాల ట్రాక్టర్ యజమానులతో రైతువేదిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక కావాలనుకునే వారు వారం రోజుల ముందుగా గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి దరఖాస్తు తీసుకొని ఆర్ఐకి రూ.7వేలు చెల్లించి రసీదు పొందాలన్నారు. ప్రభుత్వం పనుల నిమిత్తం ఐదు వేల రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉల్లాస్, ట్రాక్టర్ యాజమానులు పాల్గొన్నారు.

తాంసి: ఇసుక అవసరం ఉన్న వారు రెండు రోజుల ముందుగా మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ సూచించారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. సాండ్ మైనింగ్ మీద కొత్తగా ఆపరేషన్ గైడ్‌లైన్స్‌ను జిల్లా కలెక్టర్ ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బుధ, గురు, శుక్రవారాల్లో మాత్రమే ఇసుక రవాణాకు ఉదయం 8 నుంచి 5 గంటల వరకు అనుమతి ఉందన్నారు. ప్రైవేట్ పనులకు రూ.700, ప్రభుత్వ పనులకు ఇసుక కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అక్రమంగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బీరప్ప ఉత్సవాలు ప్రారంభం


ఊరేగింపులో జాన్సన్‌నాయక్, భక్తులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో బీరప్ప దేవుడి ఆలయ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. బీరప్ప-కామరాతి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగబోనంతో ఊరేగింపు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూల స్వాగతం..



సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామం తురాయి పూలతో స్వాగతం పలుకుతోంది. హరిత హారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఎర్రటి పూలతో ఆకట్టుకుంటున్నాయి. అటు వైపు వెళ్లే వారిని కనువిందు చేస్తున్నాయి.

– సిరికొండ

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఏఎంవో శ్రీకాంత్‌గౌడ్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఏఐ కంప్యూటర్ శిక్షణను ఏఎంవో శ్రీకాంత్‌గౌడ్, ఉట్నూర్ ఎంఈవో ఆశన్నలతో కలిసి శనివారం ప్రారంభించారు. శిక్షణ సీఆర్పీల పర్యవేక్షణలో కొనసాగుతుందని, వేసవికాల దృష్ట్యా విద్యార్థులకు కంప్యూటర్‌పై పరిజ్ఞానం కోసం 25 తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఐఎస్‌లు పాల్గొన్నారు.

ఇచ్చోడ ఎస్సైగా పురుషోత్తం


ఎస్సై పురుషోత్తం

ఇచ్చోడ: ఇచ్చోడ ఎస్సైగా పురుషోత్తం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై తిరుపతి అదిలాబాద్‌కు బదిలీ కావడంతో జైనథ్ ఎస్సైగా పనిచేస్తున్న పురుషోత్తం ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

తారు రోడ్డు వేయండి


కంకర తేలిన తేజాపూర్‌కు రోడ్డు

నేరడిగొండ: తారు రోడ్డును వేయాలని తేజాపూర్ గ్రామస్తులు వేడుకుంటున్నారు. తేజాపూర్ గ్రామం నుంచి అంతర్‌రాష్ట్ర రహదారి కిలో మీటర్ వరకు ఉన్న తారు రోడ్డు కంకర తేలి ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తారురోడ్డు వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు స్వామి, కిరణ్ మాట్లాడుతూ దేశంలో జనగణన, కులగణన చేపట్టేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ధనుంజయ్, ముత్యాల దేవన్న, పురుషోత్తం, లక్ష్మణ్, నాగార్జున రెడ్డి, శివ, కృష్ణ, ప్రణయ్, అరవింద్, రాజు, సాయి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


వైద్యాధికారికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి

గుడిహత్నూర్: వేసవి దృష్ట్యా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన పలు రికార్డులు పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ లక్షణాలను వెంటనే గుర్తించి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని పలువురు టీబీ రోగులకు ఫుడ్ బిస్కెట్‌లను అందజేశారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, మండల వైద్యాధికారి శ్యాంసుందర్, శోభాయ్, ఆశవర్కర్లు ఉన్నారు.

వాహనదారులకు అన్నిపత్రాలు ఉండాలి


వాహనదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

ఖానాపూర్: వాహనదారులు విధిగా వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీ తదితర పత్రాలను కలిగి ఉండాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం నిర్వహించిన నాకాబందీలో ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. జిల్లా ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నాకాబందీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ అజయ్, పోలీసులు పాల్గొన్నారు. ఖానాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నాకాబందీ తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై సీఐ సీహెచ్.అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మద్యం తాగి నడిపినా.. లైసెన్స్ లేకుండా నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పోరాటంతోనే కులగణన


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగపూర్: కాంగ్రెస్ నాయకుల పోరాటంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ మాదిరి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయించిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సారంగపూర్‌లో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ మాట్లాడారు. కులగణన సర్వే పూర్తి చేసి కులాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కార్యక్రమంలో అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, అడెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, నాయకులు కోర్వ నవీన్‌రెడ్డి, మధు, భూమారెడ్డి, ముత్యంరెడ్డి, సత్యం, జగదీశ్వర్, బట్టు భోజన్న, సుభాశ్, మైలి రాజేశ్వర్, మేదరి లస్మన్న తదితరులు ఉన్నారు.